

గ్రేటర్ బెంగళూరు అభివృద్ధి ప్రాధికార అధ్యక్షుడిగా నటరాజు

బెంగళూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ బెంగళూరు అభివృద్ధి ప్రాధికార నూతన అధ్యక్షుడిగా బిడది బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జీఎస్ నటరాజు నియమితులయ్యారు. ప్రాధికార సభ్యులుగా ఎన్. నరసింహయ్య, సీహెచ్ పుట్టరాజు, రమేష్, కల్యాణ్ కుమారిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తనకు లభించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గ్రేటర్ బెంగళూరు అభివృద్ధికి శక్తివంచన లేకుండా పాటుపడుతానని నటరాజు నగరంలో శనివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.



రాజధానికి పొంచి ఉన్న జలసంక్షోభం

- రెండు నెలల పాటు తీవ్ర సమస్య?
- సర్కార్ ఆశలన్నీ బోరుబావులపైనే
- బెంగళూరు పరువు మంటగలిసింది : బీజేపీ
- విమర్శలు మాని సలహాలివ్వండి : డీసీఎం

బెంగళూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని ఒక పక్క కరువు పట్టి పీడిస్తుండడం, ఈసారి వేసవి తీవ్ర రూపం దాల్చడం, కావేరి బేసిన్‌లోని డ్యామ్‌లలో నీటినిల్వలు క్రమేపీ హరించుకుపోతుండడం వంటి పరిణామాలు రాజధాని బెంగళూరుపై తీవ్రంగానే ప్రభావం చూపుతున్నాయి. పొంచి ఉన్న జలసంక్షోభానికి ఇవి సంకేతాలుగా కనిపిస్తున్నాయనే ఆందోళన యంత్రాంగంలో కపిస్తోంది. వారం రోజులుగా నగర ప్రజలు దాహార్తితో హాహాకారాలు చేస్తుండడం, సోషల్ మీడియాలో ఇదే ప్రధాన ప్రచారస్త్రంగా మారడంతో రాష్ట్రప్రభుత్వానికి ఇబ్బందికరంగా మారింది. ప్రత్యేకించి నగరంలో విలీనమైన 110 గ్రామాల్లో సమస్య జఠిలంగా ఉండడంతో యుద్ధప్రాతిపదకన చర్యలు చేపట్టారు. రెండు నెలలపాటు అంటే ఏప్రిల్ చివరి వరకు నగరానికి తాగునీటి సమస్య ఉంటుందని అధికారులు అంటున్నారు. కావేరి జలాల నిర్వహణా ప్రాధికార ఆదేశాలతో పదే పదే తమిళనాడుకు నీటిని విడుదల చేయడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని కన్నడ సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఈ అంశంపై తాము చేసిన పోరాటానికి మద్దతు ఇవ్వని నగర ప్రజానీకంపై ఇప్పుడు ఏకంగా ఈ సంఘాలు గుర్రుగా ఉన్నాయి.



ట్యాంకర్లలో నీరు పట్టుకుంటున్న నగరవాసులు

సర్కార్ ఆశలన్నీ బోరుబావులపైనే

రాష్ట్రప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించేందుకు తీవ్రంగానే కసరత్తు చేపట్టింది. ప్రత్యేకించి బోరుబావులపైనే భారీగా ఆశలు పెట్టుకుంది. 50శాతం బోరుబావులు ఎండిపోవడంతో ప్రైవేట్‌కు చెందిన బోర్లను తన నియంత్రణలోకి తీసుకొచ్చేందుకు కసరత్తు చేపట్టింది. ప్రైవేట్ ట్యాంకర్ల దూకుడుకు బ్రేక్ వేసే దిశలో జిల్లా అధికారి వాటర్‌ట్యాంకర్లకు ధరలను ఖరారు చేశారు. 6వేల లీటర్ల సామర్థ్యం కల్గిన వాటర్‌ట్యాంకు 5 కిలోమీటర్ల పరిధిలోపు అయితే రూ.600గాను, 10 కిలోమీటర్లలోపైతే రూ.750గా ఖరారు చేశారు. 8వేల లీటర్ల ట్యాంకరకు ఈ ధరలు వరుసగా రూ.700గాను, రూ.850గాను ఉంటాయి. ఇదే 12వేల లీటర్లకైతే ధరలు వరుసగా రూ.వెయ్యిగాను, రూ.1200 గాను ఉంటాయని బెంగళూరు నగర జిల్లా అధికారి కేఏ దయానంద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇంతకుమించి అధిక ధరలు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. తాగునీటిని వృథా చేయవద్దని, ఇతర అవసరాలకు వినియోగించవద్దని జలమండలి ఆదేశాలు జారీ చేసింది. ఈమేరకు సంస్థ అధ్యక్షుడు వి. రామప్రసాద్ మనోహర్ ఒక ప్రకటన విడుదల చేశారు. కాగా బెంగళూరు నగరంలోని అన్ని జోన్లలోనూ తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు నోడల్ అధికారులను నియమించినట్టు బీబీఎంపీ చీఫ్ కమిషనర్ తుషార్ గిరినాథ్ వెల్లడించారు. నగరవ్యాప్తంగా విద్యాసంస్థల్లోని మరుగుదొడ్లకు నీటి కొరత సమస్యగా పరిణమించిందని కర్ణాటక ప్రాథమిక, ఉన్నత పాఠశాలల పాలకమండళ్ల ప్రధాన కార్యదర్శి బి. శశికుమార్ వెల్లడించారు. విద్యాసంస్థలకు ప్రభుత్వమే ట్యాంకర్ల ద్వారా ఉచితంగా నీటిని సరఫరా చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

బెంగళూరు పరువు మంటగలిసింది : బీజేపీ

కరువు పరిస్థితి అధిగమించే విషయంలో ప్రభుత్వం ఘోరంగా విఫలం కావడం వల్లే రాజధానికి జలక్షామం ఏర్పడిందని బీజేపీ ఆరోపించింది. జలసంక్షోభ తీవ్రత సోషల్ మీడియాలో భారీగా వైరల్ అవుతుండడంతో బెంగళూరు నగర పరువు మంటగలిసిందని ప్రతిపక్షనేత ఆర్. అశోక్ మండిపడ్డారు. నగరంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బ్రాండ్ బెంగళూరు అంటే జలసంక్షోభమేనా..? అంటూ ఎద్దేవా చేశారు. పరిస్థితిని చక్కదిద్ది నగర శివారు ప్రాంతాల్లో ప్రజల దాహార్తి తీర్చాలని ఆయన డిమాండ్ చేశారు. తాగునీటి సరఫరాకు కూడా ప్రభుత్వం వద్ద డబ్బులు లేవేమో అంటూ విరుచుకుపడ్డారు. కావేరి జలాల విడుదలను ఏకంగా 30శాతం తగ్గించారని, వారానికి రెండు సార్లు విడుదల అవుతున్న నీరు ఇకపై వారానికి ఒకసారి సరఫరా కావడం అనుమానంగా ఉందన్నారు.

విమర్శలు మాని సలహాలివ్వండి : డీసీఎం



ప్రతి విషయాన్ని బీజేపీ రాజకీయం చేస్తోందని కాంగ్రెస్ మండిపడింది. విమర్శలు మాని సరైన సలహా, సూచనలు ఇస్తే వాటిని పాటించేందుకు సిద్ధంగా ఉన్నామని ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ పేర్కొన్నారు. రాజధాని బెంగళూరు నగర జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా ఉన్న ఆయన మాట్లాడుతూ వేలాది నీటి ట్యాంకర్లను ప్రభుత్వం నియంత్రణలోకి తీసుకుందని, గతంలో ఎన్నడూ లేని విధంగా ట్యాంకర్లకు ధరలు ఖరారు చేసి నీటి మాఫియాకు బ్రేక్ వేశామని తెలిపారు. మే నాటికి బెంగళూరులో విలీనమైన 110 గ్రామాలకు కావేరి జలాలు అందించడం ఖాయమన్నారు. కరువు పరిస్థితి వల్లే జలసమస్య తీవ్రంగా ఉందని, త్వరలోనే ఈ సమస్య పరిష్కారం అవుతుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

'నీరిల్ల... నీరిల్ల...'



ఖాళీ బిందెలతో మాజీ ఉప మేయర్ నిరసన

- సోషల్ మీడియాలో ఆకర్షిస్తున్న బీజేపీ రీల్

బెంగళూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): వేసవి తీవ్రత ఒక వైపు.. తాగునీటి హాహాకారాలు మరొకవైపు.. వీటి మధ్య రాజధాని ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. బెంగళూరు మాజీ ఉప మేయర్ సీఆర్ రామమోహన్‌రాజు ఇదే అంశాన్ని ప్రధానంగా ప్రస్తావిస్తూ శుక్రవారం ప్రత్యేక రీల్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. కొన్ని గంటల వ్యవధిలోనే ఈ రీల్‌కు అనూహ్య స్పందన లభించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం, మహాశివరాత్రి పండుగ అయినా నగరంలోని చాలా ప్రాంతాల్లో తాగునీటి సరఫరా లేక మహిళలు నానా ఇబ్బందులు పడ్డారని ప్రభుత్వం కళ్లు తెరిపించేందుకే ఈ విధంగా ఖాళీ బిందెలతో మహిళా సోదరీమణులతో కలిసి రీల్ చేశానని మోహన్‌రాజు మీడియాకు చెప్పారు.

యువతి ప్రేమకు కుటుంబం ఛిద్రం

- పరువు కోసం రైలు పట్టాలపై ఆత్మహత్యకు యత్నం
- తల్లిదండ్రుల మృతి
- యువతికి తీవ్ర గాయాలు



రాయచూరు, మార్చి 9 : యువతీ యువకుల ప్రేమ మత్తు ఎంతటి దారుణానికైన దారి తీస్తుందనేందుకు నగరంలో జరిగిన ఓ సంఘటన నిదర్శనంగా నిలిచింది. నగరానికి చెందిన 21 ఏళ్ల యువతి షైమునా ప్రేమ వ్యవహారం కుటుంబ ఆత్మహత్యకు దారి తీసింది. షబ్బీర్ అహ్మద్(45), జులేఖా(35) దంపతులకు షైమునా ఒక్కటే కూతురు. ఆమె ఓ ఉన్నత కుటుంబానికి చెందిన పిల్లలకు ట్యూషన్ చెబుతోంది. ఈ క్రమంలో ఆ అమ్మాయి తాను పని చేసే ఇంట్లో రెండు బంగారు గొలుసులు కాజేసింది. వాటిని తాను ప్రేమించిన యువకుడు సర్ఫరాజ్‌కు అప్పగించింది. తల్లిదండ్రులకు తెలియకుండా దూరంగా వెళ్లి పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకుంది. బంగారు ఆభరణాలు చోరీ జరిగినట్లు గుర్తించిన ఇంటి యజమానులు రాయచూరు వెస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో హడలిపోయిన యువతి తాను దొంగలించిన బంగారు నగల్లో ఒకదానిని కిటికిలో నుంచి ఇంట్లోకి విసిరి వేసింది. ఈ దృశ్యం మొత్తం సీసీ కెమెరాలో నిక్షిప్తం కాగా గమనించిన పోలీసులు యువతిని స్టేషన్‌కు పిలిపించి విచారించారు. మరో గొలుసును తిరిగి ఇవ్వాలని సర్ఫరాజ్‌ను కోరింది. దీంతో యువతితో మాట్లాడేందుకు ఇష్టపడని యువకుడు ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకున్నాడు. పోలీసుల నుంచి ఒత్తిడి పెరగడంతో అమ్మాయి విషయాన్ని పేద తల్లిదండ్రులకు చెప్పుకుంది. విషయమంతా విన్న తల్లిదండ్రులు నిర్ఘాంత పోయారు. పరువు పోయిందంటు కూతురుతో కలిసి తల్లిదండ్రులు శనివారం ఉదయం యరమరస్ సమీపంలో రైలు ప ట్టాలపై పడి ఆత్మహత్యకు ప్రయత్నించారు. తల్లిదండ్రులు ఇద్దరు అక్కడికక్కడే మృత్యువాతపడగా యువతి ప్రాణాలతో బయట పడి తీవ్ర గాయాలపాలైంది. ఆ మెను రిమ్స్ ఆస్పత్రికి తరలించి, మెరుగైన చికిత్స కోసం బళ్లారి విమ్స్‌కు తరలించారు. వెస్ట్ పోలీసులు మరింత లోతుగా విచారణ జరుపుతున్నారు.



సోలార్ ప్యానెల్స్‌ను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి సిద్దరామయ్య

సౌరశక్తి రైతులకు వరం

- వ్యవసాయ రంగంలో సౌర విప్లవానికి శ్రీకారం
- కరువుకు పరిష్కారం చూపే అద్భుత కార్యక్రమం : సీఎం

బెంగళూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రైతాంగానికి సౌరశక్తి రానున్న రోజుల్లో వరప్రసాదం కానుందని ముఖ్యమంత్రి సిద్దరామయ్య పేర్కొన్నారు. రైతుల సౌరశక్తిమేళాను బెంగళూరులోని జీకేవీకేలో శనివారం సీఎం లాంఛనంగా ప్రారంభించారు. ప్రధానమంత్రి కుసుమ్ పథకంలో బీ, సీ కార్యక్రమాలకు కూడా ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సీఎం ప్రసంగిస్తూ వ్యవసాయ రంగంలో చోటు చేసుకుంటున్న పరిశోధనలు అన్నదాతల ముంగిట చేరాలని అప్పుడే వాటికి అర్థం పరమార్థం దక్కుతాయన్నారు. గత కొన్ని సంవత్సరాలు కరువు పీడిస్తోందని, వర్షాలపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్న రైతాంగానికి సౌరశక్తి ఎంతో ఉపయోగం కానుందన్నారు. సౌరశక్తిని గరిష్ఠంగా వినియోగించుకుని పంటపొలాలకు నీటిని అందించడం ఎంతో లాభదాయకమన్నారు. తక్కువ ఖర్చుతోనే దీన్ని విజయవంతంగా అమలు చేసేందుకు పక్కా ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని అన్నారు. దేశంలోనే అధికసంఖ్యలో మైదాన ప్రాంతాన్ని కల్గిన రెండో రాష్ట్రం కర్ణాటక అన్నారు. వ్యవసాయ యూనివర్సిటీల పరిశోధనలు పూర్తిస్థాయిలో రైతాంగం దరికి చేరితే దిగుబడులు బాగా పెంచుకునే అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 32వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పాదన జరుగుతోందని, రానున్న ఏడేళ్లలో దీన్ని 60వేల మెగావాట్లకు పెంచుకోబోతున్నామన్నారు. సోలార్ విద్యుత్‌పంప్ సెట్ల ప్యానెల్స్ కొనుగోళ్లకు రాష్ట్రప్రభుత్వం సబ్సిడీని 30 నుంచి 50శాతానికి పెంచిందని, దీన్ని అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇంధనశాఖ మంత్రి కేజే జార్జ్, ఉన్నత విద్యాశాఖ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్‌తోపాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మైసూరు నుంచి యువరాజు యదువీర్ పోటీ

- బీజేపీ రాష్ట్ర నేతలకు ఢిల్లీ నుంచి పిలుపు



బెంగళూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మైసూరు లోక్‌సభ బీజేపీ టిక్కెట్ యువరాజు యదువీర్‌కు దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. రెండు సార్లు వరుసగా ఎంపీగా కొనసాగిన ప్రతాప్‌సింహకు టిక్కెట్ దక్కడం అనుమానమేనని తెలుస్తోంది. ఇందుకు సంబంధించి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర వ్యాఖ్యలు మ రింత బలాన్నిస్తున్నాయి. శనివారం బెంగళూరులో ఆ యన మీడియా ప్రశ్నలకు నేరుగా సమాధానాలు ఇవ్వకుండా దాటవేయడం సర్వత్రా చర్చనీయాంశమవుతోంది. ఢిల్లీ నేతలతో జరిగిన చర్చల్లో మైసూరు టిక్కెట్ అంశం ఏమైందని ప్రశ్నించగా నాలుగు గోడల మధ్య చర్చను బహిరంగం చేయలేనని అన్నారు. 28 నియోజకవర్గాలకు ఉత్తమ అభ్యర్థులను రంగంలోకి దించుతామని తెలిపారు. మరో మూడు నాలుగురోజుల్లో జాబితా ఖరారు కానుందన్నారు. రెండు విడతల్లో జాబితా ప్రకటిస్తామని పేర్కొన్నారు. జయదేవ ఆసుపత్రి మాజీ డైరెక్టర్ సీఎన్ మంజునాథ్‌కు టిక్కెట్ విషయం మీడియాలోనే జోరుగా ప్రచారం అవుతోందన్నారు. ప్రతాప్‌సింహకు మరోసారి టిక్కెట్ విషయాన్ని దాటవేయడం సర్వత్రా అనుమానాలకు దారి తీస్తోంది. మైసూరు టిక్కెట్ కోసం ప్రతాప్‌సింహతోపాటు అప్పచ్చురంజన్ ప్రయత్నిస్తున్నారు. ప్రతాప్‌సింహ వరుసగా రెండుసార్లు విజయం సాధించారు. రానున్న ఎన్నికల్లోనూ టిక్కెట్ తనదే అనే ధీమాలో ఉన్నారు. అనూహ్యంగా మాజీ పోలీసు అధికారి భాస్కర్‌రావు కూడా మైసూరులో పోటీ చేసేందుకు సిద్ధమయ్యారు. ఇటీవలి శాసనసభ ఎన్నికలకు ముందు ఐపీఎస్ హోదాకు రాజీనామా చేసి బీజేపీలో చేరారు. బెంగళూరు చామరాజపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. అధిష్ఠానం మైసూరు రాజకుటుంబానికి చెందిన యదువీర కృష్ణదత్త చామరాజ ఒడెయార్‌ను బీజేపీలోకి తీసుకొచ్చి లోక్‌సభ అభ్యర్థిని చేయాలని ఆలోచనలో ఉంది. ఏడాదిన్నర క్రితం ప్రధానమంత్రి నరేంద్రమోదీ మైసూరు ప్యాలెస్‌ను సందర్శించిన వేళ ఈ అంశంపై చర్చ జరిగినట్టు తెలుస్తోంది. రాజకుటుంబానికి చెందిన శ్రీకంఠదత్త ఒడెయార్ కాంగ్రెస్‌లో కీలకనేతగా వ్యవహరించడమే కాక ఎంపీగాను కొనసాగారు. ప్రస్తుత యువరాజును బీజేపీలోకి తీసుకొచ్చే ప్రయత్నాలు దాదాపు కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది.

బీజేపీ రాష్ట్ర నేతలకు ఢిల్లీ నుంచి పిలుపు

బీజేపీ రాష్ట్ర నేతలకు ఢిల్లీ నుంచి పిలుపు వచ్చినట్టు సమాచారం. రెండు రోజులపాటు ఢిల్లీలో గడిపి టిక్కెట్ల విషయమై సుదీర్ఘచర్చల్లో పాల్గొన్న అగ్రనేతలు శివరాత్రి సందర్భంగా శుక్రవారం వెనుతిరిగి వచ్చారు. అంతలోనే శనివారం మరోసారి ఢిల్లీ నుంచి పిలుపు వచ్చినట్టు తెలుస్తోంది. ఆదివారం సమీక్షలు ముగించి టిక్కెట్లు ఖరారు చేసే అవకాశం ఉంది.

నేడు బెంగళూరులో టీడీపీ సమావేశాలు

- హాజరు కానున్న చిత్తూరు, పరుచూరు అభ్యర్థులు



గురజాల జగన్ మోహన్



ఏలూరు సాంబశివ రావు

బెంగళూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ తరఫున పోటీ చేస్తున్న చిత్తూరు అభ్యర్థి గురజాల జగన్ మోహన్, పరుచూరు నియోజకవర్గ అభ్యర్థి ఏలూరు సాంబశివరావు ఆదివారం నగరంలో ఆత్మీయసమావేశాలు నిర్వహిస్తున్నారు. తెలుగుదేశం, జనసేన పార్టీ కార్యకర్తలను ఆత్మీయంగా స్వాగతిస్తున్నారు. బెంగళూరులో నివసించే చిత్తూరు, పరుచూరు నియోజకవర్గాల ప్రజలతో సమావేశం కానున్నారు. ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని కోరనున్నారు. పోలింగ్‌కు ముందుగానే సొంతూళ్లకు వచ్చి బంధుమిత్రులతో కలసి తెలుగుదేశం, జనసేన ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని వారు కోరనున్నారు. చిత్తూరు అభ్యర్థి గురజాల జగన్ మోహన్ వీవీ కన్వెన్షన్‌హాల్, చన్నసంద్ర, ఉత్తరహళ్లి మెయిన్‌రోడ్డు, ఆర్‌ఎన్‌ఎస్‌ఐటీ కళాశాల సమీపంలో సభ నిర్వహిస్తున్నారు. ఉదయం 10 గంటలకు సభ జరగనుంది. ఇక పరుచూరు నియోజకవర్గ అభ్యర్థి ఏలూరు సాంబశివరావు ఆధ్వర్యంలో మహదేవపురలోని ఎస్‌కేజీ కల్యాణమండపంలో సమావేశం జరగనుంది. తెలుగుదేశం, జనసేన పార్టీ అభిమానులు కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

కేంద్రమంత్రులకు అసమ్మతి సెగ


- జోషికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో ప్రచారం
- భగవంత్ ఖూబాపై అధిష్ఠానానికి ఫిర్యాదులు
- శోభాకరంద్లాజెపై సొంతపార్టీలోనే నిరసనలు

బెంగళూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం నుంచి ఎంపీలుగా ప్రాతినిధ్యం వహిస్తూ కేంద్రంలో కీలకమంత్రులుగా కొనసాగుతున్న వారికి అసమ్మతి సెగ తీవ్రమైంది. మరికొన్ని రోజుల్లోనే టిక్కెట్లు ఖరారయ్యే నేపథ్యంలో అసమ్మతి తారస్థాయికి చేరడంతో వారిలో గుబులు పట్టుకుంది. రాష్ట్రం నుంచి కేంద్ర కేబినెట్‌లో నలుగురు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరిలో కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి ప్రహ్లాద్‌జోషి, వ్యవసాయ, రైతు సంక్షేమశాఖ మంత్రి శోభాకరంద్లాజె, రసాయన, ఎరువుల శాఖ మంత్రి భగవంత్ ఖూబా, ఐటీ బీటీశాఖల మంత్రి రాజీవ్‌చంద్రశేఖర్ ఉన్నారు. రాజీవ్ చంద్రశేఖర్‌కు కేరళ రాష్ట్రం తిరువనంతపురం నుంచి తొలి జాబితాలోనే టిక్కెట్ ఖరారైంది. రాష్ట్రానికి చెందిన ముగ్గురు మంత్రులపైనా తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమవుతోంది. భగవంత్ ఖూబాకు టిక్కెట్ ఇవ్వరాదని నాలుగు నెలల నుంచి వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్రనేతలతోపాటు ఢిల్లీ పెద్దలకు మంత్రికి వ్యతిరేకంగా లేఖలు రాశారు. కేంద్రంలో కీలకమైన పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి ప్రహ్లాద్‌జోషికి వ్యతిరేకంగా ఓ లేఖ హల్‌చల్ చేస్తోంది. 1997లో హుబ్బళ్లి ఈద్గా మైదానం పోరాటంలో ఆయన పాల్గొన్నారని, అక్కడ వివాదం లేకున్నా రాజకీయం కోసం కుట్ర పన్నినట్టు లేఖలో పేర్కొన్నారు. స్వాతంత్ర్య పోరాటనేతల గడ్డ హుబ్బళ్లిలో రక్తాన్ని చిందించారని, దేశభక్తి కోసం ఎంతోమంది ప్రాణాలర్పించారని తెలిపారు. కుట్రలతోనే రాజకీయంగా జోషి ఎదిగారన్నారు. 2004లో పారిశ్రామికవేత్త మదన్‌దేశాయ్‌కు బీ-ఫారం అందగా ఆయన తిరస్కరించారు. దీంతో పార్టీలో కీలకంగా వ్యవహరిస్తున్న రాజేంద్ర గోఖలేకు టిక్కెట్ ఇచ్చేందుకు సిద్ధం కాగా అప్పటి కేంద్రమంత్రి అనంతకుమార్ ద్వారా అనూహ్యంగా తెరపైకి వచ్చిన ప్రహ్లాద్‌జోషి టిక్కెట్ పొందారన్నారు. ఆ తర్వాత వరుసగా గెలుపొందుతూ వచ్చారన్నారు. ఆయనకు టిక్కెట్ ఇవ్వరాదని లేఖలో పేర్కొనడం సర్వత్రా చర్చకు కారణమవుతోంది. మరో మంత్రి శోభాకరంద్లాజెకు వ్యతిరేకంగా ఆమె నియోజకవర్గం చిక్కమగళూరులో ఇటీవల వ్యతిరేక నినాదాలు, ప్లకార్డులు ప్రదర్శించిన విషయం తెలిసిందే. పార్టీలోనే టిక్కెట్ ఆశిస్తున్న మరో నేత కుట్ర పన్నారనే విమర్శలు వ్యక్తమయ్యాయి. టిక్కెట్ విషయమై శనివారం బెళగావిలో శోభాకరంద్లాజె మాట్లాడుతూ తనకు టికెట్ ఇవ్వడం లేదని ప్రధాని మోదీ గానీ, పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా, హోంశాఖ మంత్రి అమిత్‌షా ఎక్కడా ప్రస్తావించలేదన్నారు. కొందరు అబద్ధాలను ప్రచారం చేస్తూ టిక్కెట్ రాదని తనపై ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. తనపై వ్యతిరేకత వ్యక్తమైనప్పుడే కుట్ర జరిగిందని తెలుస్తోందన్నారు. నియోజకవర్గానికి అందుబాటులో ఉంటానని, బాధ్యతాయుతమైన కేంద్ర మంత్రి పదవిలో కొనసాగుతూ రైతు సంక్షేమానికి పాటుపడుతున్నానన్నారు. తనను వ్యతిరేకించడం వెనుక ప్రత్యర్థుల రాజకీయ లబ్ధి మినహా మరో ఆలోచన లేదన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ కేబినెట్‌లో సుదీర్ఘకాలం మంత్రిగా వ్యవహరించిన డీవీ సదానందగౌడ మరోసారి యూటర్న్ తీసుకున్నారు. ప్రత్యక్ష రాజకీయాల నుంచి వైదొలగుతున్నట్టు ప్రకటించినప్పటికీ ఆయన తాజాగా పోటీకి సిద్ధమయ్యారు. టిక్కెట్ ఇవ్వకుంటే బాధ కలుగుతుందని అన్నారు. ప్రయోగాలు ఇప్పటికే ఫెయిల్ అయ్యాయని, తనకు టిక్కెట్ దక్కకపోతే తనతోపాటు కార్యకర్తలకు కలిగే బాధను సరిచేసే బాధ్యత తీసుకోవాల్సి ఉంటుందని పరోక్షంగా హెచ్చరించారు.



ప్రహ్లాద్‌జోషి శోభాకరంద్లాజె భగవంత్‌ఖూబా





తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1585.13	1,601.14
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	00
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	2,242	9,015
సామర్థ్యం (టీఎంసీలు)	7.41	23.03

కొర్రమ్మ వాగులో చెత్త తొలగించాలి



వాగులో పేరుకుపోయిన చెత్తాచెదారం, ముళ్లకంపలు

సిరుగుప్ప, మార్చి 9 : కొర్రమ్మ వాగు మరమ్మతు పనులు వెంటనే చేపట్టాలని 25వ వార్డు ప్రజలు నగర సభ అధికారులను కోరారు. సిరుగుప్ప పట్టణం ఆదోని రోడ్డుమార్గంలో కొర్రమ్మ వాగు ప్రవహిస్తోంది. ఈ వాగుకు ఇరువైపులా ముళ్లకంపలు, చెత్తాచెదారం పేరుకుపోయింది. చాలాసార్లు వార్డు వాసులు మరమ్మతు పనులు చేపట్టాలని నగరసభ అధికారులను కోరినా వారు పట్టించుకోలేదు. వర్షాకాలంలో జోరుగా వర్షాలు కురిస్తే అడ్డంకుల కారణంగా వాగు ప్రవహించక ఎన్నో సార్లు ఇళ్లల్లోకి నీరు ప్రవేశించిన సంఘటనలు వున్నాయి. కావున అధికారులు మరమ్మతు పనులుచేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా మస్తాన్ షా వలీ ఉరుసు



మస్తాన్ షా వలీ ఉరుసు జరుగుతున్న దృశ్యం

సిరుగుప్ప, మార్చి 9 : తాలుకాలోని అచ్చొళ్లి గ్రామంలో మస్తాన్ వలీ షా ఉరుసు కార్యక్రమాలను శనివారం ఎంతో ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు గంధం, జియారత్, ఉరుసు కార్యక్రమాలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తాత వారి దర్శనం పొందారు. ముస్లిం గురువులు మహమ్మద్ ఖాద్రి తాత వారికి ప్రత్యేక పుష్పాలంకార సేవలు చేసి ప్రార్థనలు చేశారు.

పదో తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులు నడపండి

కంప్లి, మార్చి 9: రానున్న పదవ తరగతి పరీక్షల నేపథ్యంలో విద్యార్థులు రాకపోకలకు ఇబ్బందులు పడకుండా కేఎస్ఆర్టీసీ అధికారులు కుడితిని, కంప్లి మీదుగా బళ్లారికి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలంటూ కుడితిని పట్టణ పంచాయతీ మాజీ అధ్యక్షులు రాజశేఖర్ తెలిపారు. ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటుచేయడంతో బస్సుల్లో విద్యార్థుల కన్నా మహిళలే ఎక్కువగా ఉంటున్నారు. దీంతో విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కుడితిని నుంచి కంప్లికి, బళ్లారికి వెళ్లే విద్యార్థులకు ఇబ్బందిగా మారింది. కనుక కేఎస్ఆర్టీసీ అధికారులు పరీక్షలను దృష్టిలో వుంచుకుని ఉదయం కంప్లి నుంచి బళ్లారికి, సాయంత్రం బళ్లారి నుంచి కంప్లికి ప్రత్యేక బస్సులు నడపాలని ఆయన కోరుతున్నారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్లలో కోచ్‌ల సంఖ్య పెంచాలి

రాయచూరు, మార్చి 9 : రాయచూరు మార్గంలో సంచరించే ఎక్స్‌ప్రెస్ రైళ్లల్లో జనరల్ బోగీలు, సెకెండ్ క్లాస్ స్లీపర్ కోచ్‌ల సంఖ్యను మరింతగా పెంచాలని ఏఐడీవైఓ రాష్ట్ర అధ్యక్షుడు శరణప్ప ఉద్బాళ్ డిమాండ్ చేశారు. రైల్వే ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోరుతూ శనివారం నగరంలోని రైల్వే స్టేషన్ వద్ద ఏఐడీవైఓ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు రాయచూరు నగరం నుంచి పెద్ద సంఖ్యలో ప్రయాణీకులు బెంగళూరుకు ప్రయాణిస్తున్నందున వారి సంఖ్య కనుగుణంగా కోచ్‌లను పెంచాలన్నారు. నేటి సామాజిక, ఆర్థిక పరిస్థితుల్లో రైల్వే ప్రయాణమే కొంత ఊరటగా ఉన్నప్పటికి కోచ్‌ల సంఖ్య క్రమంగా తగ్గుతుండడం సమస్యగా మారిందన్నారు. రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులు జరుగుతున్న వేళ ప్రయాణీకులకు మరిన్ని మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ మేరకు రైల్వే స్టేషన్ మాస్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

సిరిగేరి తాలుకాలో నీటి ఎద్దడి

23 గ్రామాలు, 12 గ్రామ పంచాయతీల్లో తాగునీటికి కటకట

కంప్లి, మార్చి9 : సిరిగేరి తాలుకాలోని గ్రామాలు నీటి సమస్యతో ఇబ్బందిపడుతున్నాయి. రోజురోజుకి వేసవి ప్రభావం అధికమవుతుండటంతో కొన్ని గ్రామాలలో నీరు లేక అవస్థలు పడుతున్నారు. ప్రతి గ్రామంలో జేజీఎం పథకం కింద నీటి కొళాయిలు ఏర్పాటు చేసినా కేవలం అవి కేవలం దిష్టిబొమ్మలుగా నిలిచిపోయాయి. ఒక్క కొళాయి నుంచి గుక్కెడు నీరు కూడా రావడంలేదని ప్రజలు, రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాలుకాలో మొత్తం 49 ఆర్‌వో ప్లాంటులున్నా అవి దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. అలాగే తాలుకాలో ఎనిమిది చెరువులున్నా కలుషితమైన ఆ నీటినే ప్రజలు ఉపయోగించడంతో చర్మవ్యాధులు వచ్చి ఇబ్బందులు పడుతున్నారు. హెచ్ వీరాపురం, సోమలాపురం, ఓర్వాయి. ఏళుబెంచి, కెరికెరి, కలకంబ్ల, సిద్దమ్మనహళ్లి, ఎర్రంగళి, వడ్డట్టి, దమ్మూరు, కోళూరు, బైలూరు, తదితర గ్రామాలలో నీటి సమస్య ఎక్కువగా ఉంది. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులకు చీమ కుట్టినట్లు కూడా లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కురుగోడు పట్టణంలో 23 వార్డుల్లో ప్రజలు తాగునీటి సమస్యతో ఇబ్బందిపడుతున్నారు. ప్రతి నిత్యం పురసభ ట్యాంకర్ల ద్వారా నీటిని వార్డు ప్రజలకు అందిస్తోంది. పేద కుటుంబాల వారు కూలీ పనులకు వెళ్లకుండా ప్రతినిత్యం నీటి కోసమే ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ సమస్యపై తాలుకా ఈవోను విచారించగా చెరువుల్లో కొద్దిపాటి నీరు ఉందని, నీటి సరఫరా అధికారులకు ఆ వివరాలు తెలియజేశామన్నారు. అలాగే ఎల్ఎల్‌సీ కింది భాగాన వున్న గ్రామాల్లో ఉప కాలువల ద్వారా చెరువుల్లో నీటిని నింపి నీటి సమస్య తలెత్తకుండా చూడాలని సూచించామన్నారు. అలాగే నీటి సమస్య ఏర్పడినగ్రామాలో నూతన బోర్లు వేయించాలని సూచించామన్నారు. వీటికి నిధులు కూడా మంజూరైనట్లు తెలిపారు.



కురుగోడు 23వ వార్డులో ట్యాంకర్ వద్ద నీరు పట్టుకుంటున్న మహిళలు



వడ్డట్టి గ్రామంలో దిష్టిబొమ్మలుగా పడివున్న జేజీఎం నీటి కొళాయిలు

ఈ సందర్భంగా కలకంబ్ల గొల్లర నాగరాజు మాట్లాడుతూ గ్రామాల్లో బోర్ల నీటిలో ఫ్లోరైడ్ వుండటం వల్ల గ్రామస్తులంతా అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. సింధిగేరి నీలమ్మ మాట్లాడుతూ తమ గ్రామాల్లో నీటి సమస్య వుండటం వల్ల ప్రైవేటు వాహనాల నుంచి బిందె రూ. పది ప్రకారం కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ విధంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వెంటనే జిల్లా అధికారులు గ్రామాలలో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

కంప్లిని నగరసభగా మార్చాలి



ఊహాత్మకమైన కంప్లి నగర సభ మ్యాప్

కంప్లి, మార్చి 9 : రోజురోజుకు పట్టణంలో జనసంఖ్య పెరుగుతోంది. కానీ కంప్లి పట్టణం ఇప్పటికీ పురసభగానే కొనసాగుతోంది. జనసంఖ్య పెరుగుతున్నా నిధులు మాత్రం అంతంతమాత్రంగానే వస్తున్నాయి. ప్రజల సంఖ్యకు తగ్గట్లుగా నిధులు రాక నిరాశకు గురవుతున్నారు. 1967లో కంప్లి పట్టణ పంచాయతీగా ఏర్పడింది. 1978లో పురసభగా ఏర్పడింది. అప్పట్లో పట్టణంలో 23 వార్డులను ఏర్పాటు చేశారు. 2011 జనగణన చేపట్టారు. అప్పుడు 39307 మంది జనాభా ఉన్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం దాదాపు 64 వేల వరకు జనాభా పెరిగివుండవచ్చునని తెలిపారు. ఎమ్మెల్యే జేఎన్ గణేష్ 2022 డిసెంబర్ 21న జరిగిన సభలో నగరసభ తీర్మానం చేశారు. 23 వార్డులతో పాటు నెంబర్ 10 ముద్దాపురం, ఎల్ఎం క్యాంపు, ప్రభుక్యాంపు, నెల్లూడి కొట్టాలను కూడా కలుపుకుని నగరసభకు ప్రతిపాదనలు పంపారు. నగర సభ ఏర్పడినట్లయితే ప్రభుత్వం మరిన్ని నిధులు ఇస్తుందని, బసవనగౌడ, రామన్న, సీఆర్ హనుమంతు, హేమయ్య స్వామి, అంబన్న, నాగరాజు అంటున్నారు. కనుక వెంటనే ప్రభుత్వం నగరసభ ఏర్పాటు చేయాలన్నారు. జనసంఖ్య పెరుగుతున్నా నిధులు పెరగడంలేదని, త్వరలోనే ముఖ్యమంత్రి కంప్లి పట్టణంపై దృష్టి సారించి కంప్లిని నగరసభగా మార్పు చేయాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీ స్థానాలపై ప్రధాన పార్టీల గురి

బళ్లారి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఎస్సీఎస్టీ లోక్‌సభ రిజర్వేషన్ల స్థానాలకు అభ్యర్థుల ఎంపికలో జాతీయ రాజకీయ పార్టీలైన భారతీయ జనతా పార్టీ, కాంగ్రెస్ తలమునకలైనాయి. అభ్యర్థుల ఎంపికతో పాటు ఎన్నికల్లో ప్రభావితం చేసే నాయకుడు, అలాగే ఆర్థిక పరిస్థితులను తట్టుకునే అభ్యర్థుల కోసం రెండు పార్టీలు వెదుకుతున్నాయి. ఒకవేళ ప్రస్తుతం రిజర్వేషన్ ఉన్న స్థానాల్లో లోకల్‌గా పోటీకి గట్టిగా ఎవరూ లేకుంటే వేరే ప్రాంతాల నుంచి ఇతరులను తెచ్చి అయినా ఈ రిజర్వేషన్ స్థానాల నుంచి పోటీ చేయించాలని రెండు పార్టీలూ ఆలోచిస్తున్నాయి. అందుకోసం అభ్యర్థుల జాతకాలను జల్లెడపడుతున్నాయి. కర్ణాటకలో 28 ఎంపీ స్థానాలు ఉన్నాయి. ఇందులో ఏడు స్థానాలను ఎస్సీ, ఎస్టీలకు రిజర్వు చేశారు. బిజాపురం, కలబురగి(గుల్బర్గా) చిత్రదుర్గం, చామరాజ్‌నగర, కోలార్‌లను ఎస్సీలకు రిజర్వు చేశారు. అలాగే రాయచూరు, బళ్లారి స్థానాలను ఎస్టీకి రిజర్వు చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలోని రిజర్వుడు ఎంపీ స్థానాల్లో ఒకచోట కాంగ్రెస్, ఒక చోట జేడీ(ఎస్), మరో చోట ఇండిపెండెంట్ మాత్రమే పదవుల్లో ఉన్నారు. మిగిలిన వారంతా బీజేపీ వారే కావడం విశేషం. ప్రస్తుతం ఎంపీ ఎన్నికలకు త్వరలో నోటిఫికేషన్ విడుదల కానుంది. ఈనేపథ్యంలో ఎస్సీ, ఎస్టీ రిజర్వుడు స్థానాల్లో గెలుపే లక్ష్యంగా సరైన అభ్యర్థుల కోసం రెండు పార్టీలు గాలిస్తున్నాయి.



భగ భగలాడుతున్న భానుడు



బళ్లారి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): సూర్యుడు నిప్పులు కక్కుతున్నాడు. ఎండ వేడిమికి ప్రజానీకంతో పాటు పశుపక్ష్యాదులూ ఉక్కిరి బిక్కిరవుతున్నాయి. ఫిబ్రవరి నెలలో 34 డిగ్రీల సెల్సియస్ ఉన్న ఉష్ణోగ్రత మార్చి రెండో వారం నాటికి అంటే శనివారం నాటికి ఏకంగా 37డిగ్రీల సెల్సియస్‌కు చేరుకుంది. దీంతో జలాశయాల్లో ఎంతో కొంత నిల్వ ఉన్న నీరు కూడా ఎండ వేడిమికి ఆవిరైపోతోంది. ఇక పగలు పది దాటిందంటే ఎండ వేడిమి ప్రతాపం చూపుతోంది. బళ్లారిలో శనివారం 37డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదయింది. విజయనగర, రాయచూరు, కొప్పళ, చిత్రదుర్గం జిల్లాల్లో కూడా ఇలాగే నమోదయినట్లు వాతావరణ శాఖ తెలిపింది.

ఉష్ణోగ్రతలు (9-3-2024)
గరిష్ఠం : 37.0
కనిష్ఠం : 24.0



కదలని బండి.. కలిసి తోయండి



కంప్లిలో నిలిచిపోయిన బస్సును తోస్తున్న ప్రయాణికులు

కంప్లి, మార్చి 9 : బళ్లారి డిపో-1కు చెందిన బాగల్ కోట నుంచి బళ్లారికి నడిపే బస్సు శనివారం కంప్లిలో స్టార్ట్ కాక మొరాయిస్తుండటంతో చివరకు ప్రయాణికులు, కండక్టరు బస్సును సుమారు అర కిలోమీటరు పాటు తోయాల్సి వచ్చింది. ఇటువంటి పాత బస్సుల వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డిపోలో అధికారులు కండీషన్‌లో వుండే బస్సులను నడపాలని ప్రయాణికులను కోరుతున్నారు.

ఘనంగా పీడీహళ్లి రామలింగేశ్వరస్వామి రథోత్సవం



వైభవంగా పీడీ హళ్లిలో రథోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

బళ్లారిరూరల్, మార్చి 9 : తాలుకాలోని పరమదేవనహళ్లి గ్రామంలో రామలింగేశ్వర స్వామి రథోత్సవాన్ని శనివారం భక్తులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. రథోత్సవం సందర్భంగా ఉదయాన్నే వేదావతి నది నుంచి 101 మంది మహిళలు 101 కలశాలలో జలాన్ని తీసుకువచ్చి స్వామివారికి అభిషేకంచేసి పూజలు నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు రథాన్ని రామలింగేశ్వరస్వామి దేవస్థానం నుంచి ఎదురుబసవన్న దేవస్థానం వరకు లాగారు. రథోత్సవానికి మాజీ మంత్రి శ్రీరాములు దంపతులు హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ రథోత్సవం సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తాదులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. రథోత్సవంలో గ్రామ ప్రముఖులు, యువకులు, నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

మహిళా పౌరకార్మికులకు దంత పరీక్షలు



దంత పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

బళ్లారి సిటీ, మార్చి 9: అంతర్జాతీయ మహిళాదినోత్సవంలో భాగంగా శనివారం నగరంలోని గాంధీభవన్‌లో మహిళా పౌర కార్మికులకు ఉచిత దంతవైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎం.ప్రభంజన్‌కుమార్ నేతృత్వంలో, ఇండియన్ డెంటల్ డాక్టర్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో మేయర్ శ్వేత మాట్లాడుతూ మహిళా పౌరకార్మికులు సేవా కార్యక్రమాలు చేస్తూ మనందరి ఆరోగ్యాన్ని కాపాడుతున్నారన్నారు. శిబిరం నిర్వహకులు కార్పోరేషన్ సభ్యుడు ఎం.ప్రభంజన్ కమార్ మాట్లాడుతూ పౌరకార్మికులు నగరాన్ని శుభ్రం చేయడమే కాకుండా మన ఆరోగ్యాన్ని శుభ్రపరిచే పనిలోనే ఉంటారన్నారు. పౌర కార్మికుల సమస్యలపై స్పందించేందుకు సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లవేళలా సిద్దంగా ఉన్నామన్నారు. ఈకార్యక్రమంలో ఇండియన్ డెంటల్ అసోసియేషన్ జిల్లాధ్యక్షులు మధుసూధన్ కార్యదర్శి డా.శ్రీధర్, కోశాదికారి డా.రాజీవ్, సంఘం రాష్ట్ర శాఖ సభ్యులు డా.బావన, వాణిశ్రీ, 300మంది మహిళా పౌర కార్మికులకు దంత పరీక్షలు నిర్వహించగా 170 మంది మహిళల్లో దంత సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. వారికి టూత్‌పేస్టులు, ఆయింట్‌మెంట్, మాత్రలు పంపిణీ చేశారు. అంతేకాకుండా తదుపరి వైద్యం కోసం ఆసుపత్రికి వస్తే ఉచితంగా వైద్యం చేస్తానని తెలిపారు. ఈసందర్భంగా ఇద్దరు సీనియర్ సిటిజన్ శ్రామిక మహిళలను సన్మానించారు. డిప్యూటీ మేయర్ బి.జానకి, మాజీ మేయర్ రాజేశ్వరీ, సభ్యులు మించుశ్రీనివాస్, నాయకులు బిఆర్ ఎల్ శ్రీనివాస్, గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి అత్యంత కీలకం

కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

బళ్లారి సిటీ, మార్చి 9: లోక్‌సభ ఎన్నికల విధులకు కేటాయించిన అధికారులు, సిబ్బంది అందరూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించకుండా చూడాలని కలెక్టర్ సూచించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ హాల్లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ఎన్నికల ప్రకటన వెలువడిన 24 గంటల్లోగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను ఖచ్చితంగా అమలు చేసేందుకు మూడు వేర్వేరు భాగాలుగా చర్యలు తీసుకోవాలని బీఎల్‌ఓలకు తెలిపారు. ఎన్నికల ప్రకటన వెలువడిన వెంటనే జిల్లాలో రాజకీయ పార్టీల బ్యానర్లు, ఫ్లెక్సీలు, ప్రారంభోత్సవ పనుల బోర్డులు స్వాగత తోరణాలు, రాజకీయ ప్రముఖులు, ప్రజాప్రతినిధుల చిత్రాలను తొలగించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అసిస్టెంట్ కాస్ట్ అబ్జర్వర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, వీడియో సర్వైలెన్స్ బృందాలు, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. సరిహద్దులో చెక్‌పోస్టులు ఇప్పటికే పని చేస్తున్నాయన్నారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం అందరూ తమతమ బాధ్యతలను నిజాయితీగా నిర్వహించాలని, ఎన్నికల విధుల నిర్వహణలో మరింత శ్రద్ద వహించాలన్నారు. ఈసందర్భంగా జిల్లా పోలీసు సూపరింటెండెంట్ రంజిత్ కుమార్ బండారు మాట్లాడుతూ సున్నితమైన పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు అస్కారం ఇవ్వరాదన్నారు. సమస్య ఉంటే పోలీసు అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.ఈసందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మహ్మద్ జుబేరా, అసిస్టెంట్ కమిషనర్ హేమంత్, ఎలక్షన్ ట్రైనర్ రద్రేశ్‌తో పాటు తహసిల్దార్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

హోసూరు జోన్

ఘనంగా కోదండరామస్వామి మండలోత్సవం



ప్రసంగిస్తున్న బ్రహ్మశ్రీ వెంకటేశ్వరస్వామీజీ

హోసూరు, మార్చి 9: హోసూరు సమీపంలోని వన్నలవాడి గ్రామంలో శనివారం కోదండరామస్వామి ఆలయ మండలోత్సవం ఘనంగా జరిగింది. అయోధ్య బాలరాముడి ప్రతిష్ఠాపన రోజునే ఇక్కడ కూడా ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించారు. మండలం రోజులు పూర్తైన సందర్భంగా శనివారం ప్రత్యేకంగా ఏర్పాటైన కార్యక్రమానికి సద్గురు యోగినారేయణ తాత ఆశ్రమానికి చెందిన బ్రహ్మశ్రీ వెంకటేశ్వరస్వామిజీ సారథ్యం వహించగా మాజీ ఎమ్మెల్యే బీ వెంకటస్వామి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మానవజన్మను ఎలా సార్థకం చేసుకోవాలో శ్రీరాముడు ఆచరించి చూపారన్నారు. తల్లిదండ్రులు, గురువులను గౌరవించాలన్నారు. రామనామస్మరణ ఎన్నో కష్టాలను గట్టెక్కించేందుకు మార్గం చూపుతుందన్నారు. తొలుత సుప్రభాత సేవ, పంచామృత అభిషేకం విశేష పూజలు, గణపతి ఆరాధన, కలశ ఆరాధన, అగ్ని ప్రతిష్ఠ, విశేష హోమములు, తారకరామ హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. భక్తులచే అఖండ భజన కొనసాగింది. గురుపాద పూజ, మహా మంగళారతి అనంతరం భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు, అన్నదానం నిర్వహించారు.

అంగన్‌వాడీ కేంద్రానికి భూమిపూజ

హోసూరు, మార్చి 9: హోసూరు కార్పొరేషన్ రాంనగర్‌లో రూ.13 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న అంగన్‌వాడీ కేంద్రానికి మేయర్ సత్య శనివారం శంకుస్థాపన చేశారు. రాంనగర్ కోట మారియమ్మన్ దేవాలయం సమీపంలోని కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు క్రింద అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్మించనున్నారు. భూమిపూజలో డిప్యూటీ మేయర్ ఆనందయ్య, కౌన్సిలర్లు మంజమ్మ గిరి, మారక్క, చెన్నీరప్ప, నాగరాజ్, డివిజన్ కార్యదర్శి రాము, సర్కిల్ కార్యదర్శులు జాన్, మోహన్ బాబు, డీఎంకే కార్యదర్శులు గిరిరాజన్, కాంతరాజ్ ముపిన, షాలిని, రాజీ ఆది, కృష్ణమూర్తి దండపాణి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన

హోసూరు(మత్తిగిరి), మార్చి 9: కృష్ణగిరి పశ్చిమ జిల్లా కాంగ్రెస్ కమిటీ హోసూరు విభాగం ఆధ్వర్యంలో ఎస్‌బీఐ బ్యాంకు దగ్గర శనివారం నిరసన చేపట్టారు. ఎన్నికలకోసం బీజేపీకి వచ్చిన విరాళాలకు సంబంధించి ఎస్‌బీఐ నుంచి స్పష్టమైన రికార్డులు లేకపోవడాన్ని తప్పుబట్టారు. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా ఎవరెవరు ఏఏ పార్టీలకు ఎంత విరాళం ఇచ్చారనే వివరాలను ఎస్‌బీఐకు అందజేయాల్సి ఉంది. అయితే బీజేపీకి సంబంధించి ఎలాంటి సమాచారం లేకపోవడాన్ని తప్పుబట్టారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మురళీధరన్ ఆధ్వర్యంలో జరిగిన నిరసనలో జిల్లా ఉపాధ్యక్షుడు అధికార ప్రతినిధి కీర్తి గణేశ్, జిల్లా కోశాధికారి మాదేశ్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు కుమార్, నాన్ ఆర్గనైజ్ జిల్లా అధ్యక్షుడు కుమార్, నాన్ ఆర్గనైజ్ జిల్లా అధ్యక్షుడు సురేశ్, ఐటీ జిల్లా అధ్యక్షుడు కార్తీక్, ఐటీ మున్సిపల్ అధ్యక్షుడు ఆనంద్, మున్సిపల్ ఉపాధ్యక్షులు గోవర్దన్, శివప్పరెడ్డి, ముత్తప్ప, కృష్ణన్, మున్సిపల్ సెక్రటరీ జనరల్ ఇర్షాద్, కోశాధికారి వెంకటేశ్, షైజా అక్బర్ ఆలీ, యువజన బృందం అమృత్, టెక్నికల్ టీమ్ నదీమ్, జంబేరితో పాటు పలువురు పాల్గొన్నారు.



నిరసనలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

సోదర భావమే శాంతికి మార్గం: మంత్రి



మహాశివరాత్రి, మహిళా దినోత్సవ కార్యక్రమాలను ప్రారంభిస్తున్న మంత్రి భోసరాజు

● అట్టహాసంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

రాయచూరు, మార్చి 9: కులాలు, మతాలకు అతీతంగా ప్రజల మధ్య సోదరభావం పరస్పర సహకారం విల్లివిరిసిన నాడే సమాజంలో శాంతి ఉంటుందని రాష్ట్ర చిన్ననీటి పారుదలశాఖ మంత్రి ఎన్.ఎస్.భోసరాజు అన్నారు. నగరంలోని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన మహాశివరాత్రి పర్వదిన వేడుక, అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలకు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి, మహిళా అభ్యుదయం కోసం ప్రభుత్వాలు ఇచ్చే తోడ్పాటును సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించడంతో పాటు సమాజంలో తమవంతు పాత్రను మరింత సమర్థవంతంగా పోషించాలన్నారు.

వైభవంగా సామూహిక వివాహాలు

రాయచూరు, మార్చి 9 : జిల్లాలోని లింగసుగూరు తాలూకా మావినభావి గ్రామంలో ఈశ్వర దేవస్థానం మూడవ వార్షికోత్సవం సందర్భంగా శనివారం సామూహిక వివాహాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదు రోజుల పాటు శ్రవణ్‌కుమార్ శాస్త్రీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రవచన కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.




సామూహిక వివాహ కార్యక్రమాల్లో ఒక్కటైన జంటలు

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

ప్రొఫెసర్ యూఆర్ రావు (జయంతి)



అంతరిక్ష శాస్త్రవేత్త, 'పద్మ విభూషణ్' గ్రహీత ప్రొఫెసర్ యూఆర్ రావు 1932 మార్చి 10న కర్ణాటక రాష్ట్రం ఉడుపిలో జన్మించారు. పూర్తి పేరు ఉడుపి రామచంద్రరావు. డాక్టర్ విక్రమ్ సారాభాయ్ నేతృత్వం లో పీహెచ్‌డీ చేశారు. 1985లో ఇస్రో సంస్థకు ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టాక రాకెట్ సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధిని వేగవంతం చేశారు. ఇన్‌సాట్ ఉప గ్రహాల విజయవంతంతో దేశంలోని మారుమూల ప్రాంతాలకు టెలీ కమ్యూనికేషన్ సౌకర్యం, ఎస్‌టీడీ అందుబాటులోకి వచ్చింది. రిమోట్ సెన్సింగ్, వాతా వరణ సేవలు విస్తృతమయ్యాయి. ఆంట్రిక్స్ కార్పొరేషన్ మొదటి ఛైర్మన్‌గా వ్యవహరించారు. కర్ణాటక రాజ్యోత్సవ, ఆర్యభట్ట అవార్డు, జవహర్‌లాల్ నెహ్రూ అవార్డు, యూరీ గగారిన్ మెడల్ తదితర గౌరవాలు పొందారు. 2017 జూలై 24న కన్నుమూశారు.

డాక్టర్ పి.కేశవరెడ్డి (జయంతి)



వృత్తిరీత్యా వైద్యుడైనా ప్రముఖ నవలా రచయితగా పేరొందిన డాక్టర్ పెనుమూరు కేశవరెడ్డి 1946 మార్చి 10న చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలం తలుపులపల్లెలో జన్మించారు. ఆయన రాసిన ఎనిమిది నవలలు పాఠకుల ఆదరణ పొందాయి. కొన్ని హిందీలోకి తర్జుమా కాగా ఆంగ్లంలో మాక్‌మిలన్, ఆక్స్‌ఫర్డ్ వంటి సంస్థలు ప్రచురించాయి. అణగారిన వర్గాల ప్రజల కష్టజీవులకు కావ్యగౌరవం కలిగించి వారి జీవిత కదనాన్ని కథనంగా మలిచి పాఠకుడి ముందు నిలిపిన రచయిత కేశవరెడ్డి. పాండిచ్చేరిలో ఎంబీబీఎస్ చేశాక నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి విక్టోరియా మెమోరియల్ ఆసుపత్రిలో స్కిన్ స్పెషలిస్టుగా కుష్టురోగులకు సేవలందించారు. కుష్టువ్యాధిపై ఆయన రాసిన పరిశోధనా పత్రాలు పలు జాతీయ, అంతర్జాతీయ మెడికల్ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. 2015 ఫిబ్రవరి 13న మరణించారు.

ఐదు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సెలవు రోజుల్లోనూ కార్యకలాపాలు

బెంగళూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఈ నెలతో ముగియనున్న నేపథ్యంలో బెంగళూరు నగరంలోని 5 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు సెలవు రోజుల్లోనూ పనిచేయనున్నాయి. ఇందిరానగర్, చామరాజ పేట, రాజాజినగర్, యలహంక, జేపీ.నగర బస్ రిజిస్ట్రార్ కార్యాలయాలు రెండో శనివారం, ఆదివారాలు కూడా యథావిధిగా పనిచేస్తాయని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ కమీషనర్ బీఆర్ మమత నగరంలో విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రకటనలో కోరారు.

బెంగళూరు ఉత్సవకు అనూహ్య స్పందన

బెంగళూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు చిత్ర కళా పరిషత్‌లో ఏర్పాటైన గ్రాండ్ ఫ్లియా బెంగళూరు ఉత్సవ ఈ నెల 17 వరకు కొనసాగనుందని నిర్వాహకులు నగరంలో శనివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవాన్ని సినీ తారలు ప్రియాంక అరోర, రష్మిగౌడ లాంఛనంగా ప్రారంభించిన సంగతి తెలిసిందే. వివిధ రాష్ట్రాల సంస్కృతి సంప్రదాయాలకు అద్దంపట్టే హస్తకళాఖండాలతో పాటు ఎన్నో వైవిధ్య భరిత వస్తువులు, ప్రత్యేకించి వేసవి నుండి కాపాడే కాటన్ వస్త్రాల శ్రేణి యువతరం అమితంగా ఇష్టపడే ఫ్యాషన్ దుస్తులు, ఆభరణాలు, విగ్రహాలు ఈ ప్రదర్శనలో ప్రధాన ఆకర్షణగా ఉన్నాయని ప్రకటనలో పేర్కొన్నారు. నేరుగా కళాకారులే ఉత్సవంలో పాల్గొంటున్నారని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రకటనలో కోరారు.

చౌడేశ్వరి ఆలయంలో శివకోటి భజన

చింతామణి, మార్చి 9: తాలూకాలోని ఊలవాడి గ్రామ పంచాయతీ పరిధిలోని కురుప్పల్లి గేట్ సమీపాన గల చౌడేశ్వరి దేవి ఆలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని శివకోటి భజన సాగింది. స్థానిక అంబాని చిట్‌ఫండ్ యజమాని మంజునాథ్ కుటుంబం నేతృత్వంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు కొనసాగాయి. శుక్రవారం ప్రారంభమైన ఉత్సవాలు శనివారం ముగిశాయి. ఆలయాన్ని విద్యుద్దీపాలు, పుష్పాలతో అలంకరించారు. జాగరణలో భాగంగా మరసనహళ్ళి శ్యామలమ్మ బృందంచే శుక్రవారం వేకువజామున 5 గంటలనుంచి శనివారం వేకువజామున 5 వరకు భజన సాగింది. అనంతరం అమ్మవారికి మహామంగళారతి, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీ నరసింహప్ప, గాయత్రమ్మ, బీఎన్ శ్రీనివాస్, రవి తదితరులు పాల్గొన్నారు.

భార్యను హతమార్చి లొంగిపోయిన భర్త



నిందితుడు గంగులప్ప

చేళూరు, మార్చి 9: తాలూకాలోని సోమనాథపురం గ్రామపంచాయతీ పరిధిలోని వంకచిన గానపల్లిలో భార్యను హతమార్చిన భర్త చివరకు పోలీసులకు లొంగి పోయాడు. గంగులప్ప, నరసమ్మ (48) దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవారు. ఇటీవల కొంతకాలంగా భార్య వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో గంగులప్ప ఉండేవాడు. ఆమెను కడతేర్చాలని భావించాడు. శుక్రవారం రాత్రి 11 గంటలకు పశువులకు మేత కావాలన్న నెపంతో భార్యను వెంటపెట్టుకుని వెళ్లాడు. ఒక్కసారిగా భార్యపై విరుచుకుపడి చాకుతో, రాతితో కొట్టి చంపేశాడు. అనంతరం ఇంటికి వచ్చిన గంగులప్ప తాను చేసిన తప్పుకు పశ్చాత్తాపంగా పాతపాళ్య పోలీసులకు లొంగిపోయాడు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జనార్ధన్, ఎస్‌ఐ అమరలు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు. ప్రస్తుతం గంగులప్ప పోలీసుల అదుపులో ఉన్నాడు. స్థానికంగా ఈ ఘటన కలకలం చెలరేగింది.

గర్భకోశ కేన్సర్‌పై పూర్తిస్థాయి నియంత్రణ

▸▸ **మంత్రి దినేశ్ గుండూరావు**



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్ గుండూరావు

బెంగళూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): గర్భకోశ కేన్సర్ నివారణ టీకాలను మరింతగా అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ఈ వ్యాధిపై పూర్తిస్థాయి నియంత్రణ సాధించాలని ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్ గుండూరావు పిలుపునిచ్చారు. హెల్త్‌కేర్ సంస్థ రూపకర్త డాక్టర్ హేమాదివాకర్ సారథ్యంలో ఎకో, ఆర్టిస్ట్ ఫర్ హర్, హెల్త్‌కేర్ సెక్టర్ స్కిల్ కౌన్సిల్, కర్ణాటక రాష్ట్ర గైనకాలజీ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం జరిగిన శిఖరాగ్ర సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ప్రసంగిస్తూ మహిళల ఆరోగ్య సమస్యలపై అవగాహన పెరుగుతుండడం శుభ పరిణామమన్నారు. నారిశక్తి బలంగా ఉంటేనే సమాజం, దేశం బలిష్ఠంగా ఉంటాయన్నారు. డాక్టర్ హేమాదివాకర్ ఈ దిశలో చేస్తున్న కృషి అందరికీ ఆదర్శప్రాయమన్నారు. ప్రైవేట్ సంస్థల సహకారంతో గర్భకోశ కేన్సర్ నివారణ టీకాలు ప్రజలకు చౌకగా అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం జరగాలని ఆయన ఆకాంక్షించారు. దేశంలో 25 శాతం మహిళలకు పలు కారణాలతో గర్భకోశ కేన్సర్ సోకుతోందని తొలుత ప్రసంగించిన డాక్టర్ హేమాదివాకర్ పేర్కొన్నారు. ప్రారంభంలోనే గుర్తిస్తే ఈ వ్యాధి నుంచి కాపాడవచ్చునన్నారు. ఏటా 75వేలమంది మహిళలు దేశంలో గర్భకోశ కేన్సర్ కారణంగా మృతి చెందుతుండడం బాధాకరమన్నారు. ఎకో ఇండియా ఛైర్మన్ డాక్టర్ కుముద్‌రాయ్ మాట్లాడుతూ శిఖరాగ్ర సభలో మహిళల గర్భకోశవ్యాధితోపాటు ఇతర కేన్సర్ కారకాలు, ఇతర అంశాలపై విస్తృత జరుగుతోందన్నారు. దేశం నలుమూలలనుంచి కేన్సర్ వైద్యనిపుణులు సదస్సులో పాల్గొన్నారు.

నైపుణ్యాన్ని గరిష్ఠంగా వినియోగించుకోవాలి

▸▸ **యువతకు అక్సెంచర్ ఎండీ అనంతవేదగర్భం పిలుపు**



స్కాలర్‌షిప్ పొందిన విద్యార్థులతో అతిథులు

బెంగళూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ప్రపంచవ్యాప్తంగా నైపుణ్యమే కీలక పాత్ర పోషిస్తోందని విద్యార్థులు గరిష్ఠంగా వీటి ప్రయోజనాలు అందుకుని రాణించాలని అక్సెంచర్ మేనేజింగ్ డైరెక్టర్ అనంతవేదగర్భం పిలుపునిచ్చారు. బెంగళూరు బనశంకరిలోని బీఎన్ఎంఐటీ కళాశాలలో ఆర్థికంగా వెనుకబడిన, ప్రతిభావంతులైన విద్యార్థులకు శనివారం స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ భారతదేశంలో యువతకు అపారమైన ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. ఆపిల్, స్యామ్‌సంగ్ వంటి పెద్దపెద్ద కంపెనీలు భారత్‌లో తమ ఉత్పాదనా విభాగాలను ప్రారంభిస్తుండడమే ఇందుకు తార్కాణమన్నారు. విద్యార్థులు పఠనాభిరుచిని బాగా పెంచుకోవాలని కనీసం ప్రతిరోజూ కనీసం 15 నిమిషాలు పత్రికలు చదివి జ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాంలాగా కలలు కనడమే కాకుండా వాటిని సాకారం చేసుకోవాలన్నారు. 247మంది విద్యార్థులకు రూ.47లక్షలు, బోధకవర్గానికి ప్రోత్సాహకంగా రూ.27లక్షలను స్కాలర్‌షిప్‌ల రూపంలో అందజేశారు. బీఎన్ఎంఐటీ చారిటీ అధ్యక్షుడు నారాయణరావు ఆర్ మానె, ట్రస్టీలు ఈశ్వర్ ఎస్ మానె, ప్రొఫెసర్ టీజే రామమూర్తి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీఎన్ కృష్ణమూర్తి తదితర ప్రముఖులు పాల్గొన్నారు. పెద్దసంఖ్యలో విద్యార్థులు భాగస్వాములయ్యారు.

ఘనంగా కాడు మల్లేశ్వరస్వామి రథోత్సవం



మల్లేశ్వరం పురవీధులలో సాగుతున్న రథోత్సవంలో భక్తుల సందడి

బెంగళూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రముఖ పురాతన ఆలయాలలో ఒకటైన మల్లేశ్వరంలోని కాడుమల్లేశ్వరస్వామి ఆలయం ఒకటి. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా భ్రమరాంబ సమేత కాడు మల్లేశ్వరస్వామిలకు శనివారం విశేషపూజల అనంతరం రథంపై కొలువుదీర్చి ఊరేగించారు. వినాయకుడు, సుబ్రమణ్యస్వామిలను, మల్లికార్జున స్వామిలను వేర్వేరుగా మూడు రథాల్లో మల్లేశ్వరం పురవీధులలో ఊరేగించారు. రథంపై ఉప్పు, మిరియాలు, దవనం, ఏలక్కి అరటిపండ్లను వేసి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. కాడు మల్లేశ్వర గెళయెర బళగ అధ్యక్షుడు టీకే శివరాం మాట్లాడుతూ 16ఏళ్లుగా ఏటా బ్రహ్మరథోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. రథోత్సవంలో కంసాళె, వీరగాసె, పట కుణిత, డొళ్ళు కుణిత, తమటె వాద్య తదితర కళాబృందాలు పాల్గొని సందడి చేశాయి.

కాశీవిశ్వేశ్వరుడి రథోత్సవం..



చేళూరు పురవీధులలో రథోత్సవం

చేళూరు, మార్చి 9: పట్టణంలోని మెయిన్‌రోడ్డుకు అనుబంధంగా ఉన్న కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయ జాతరలో భాగంగా శనివారం రథోత్సవం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఉదయం స్వామివారికి విశేష పూజల అనంతరం రథంపై స్వామివారిని కొలువుదీర్చారు. ఆలయ ధర్మకర్తల మండలికి చెందిన రామకృష్ణారెడ్డి, మధు సూదన్ రెడ్డిలు రథోత్సవాన్ని ప్రారంభించగా పురవీధులలో రథోత్సవం సాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులందరికీ తీర్థప్రసాదాలు, అన్నదానం నిర్వహించారు. అవాంఛనీయ సంఘటనలు లేకుండా పోలీసు బందోబస్తు కొనసాగింది.

శివరాత్రి వేడుకలు



స్వామివారికి అలంకరణ

శిడ్లఘట్ట, మార్చి 9: మహాశివరాత్రిని పురస్కరించుకుని శుక్రవారం ప్రారంభమైన వేడుకలు శనివారం ముగిశాయి. పార్వతీదేవి సమేత ఈశ్వర, వినాయక, సుబ్రమణ్య, అయ్యప్ప దేవతా మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగరే శ్వరస్వామి ఆలయంలో క్షీరాభిషేకం, రుద్రాభిషేకం, ఇతర ధార్మిక కార్యక్రమాలు కొనసాగాయి. రాత్రి ద్రాక్ష, గోడుంబిలతో స్వామివారికి అలంకరణ చేశారు. శనివారం ఉదయం వరకు యామపూజలు కొనసాగాయి. ఇదే రీతిన కాశీ విశ్వేశ్వరయ్య దేవ స్థానంలో, చంద్రశేఖరస్వామి ఆలయంలో, భూతాళి మల్లేశ్వర, వీరాపుర గవిగుడ్డ గవిగంగాధరేశ్వర స్వామి ఆలయంలోనూ, సోమేశ్వర స్వామి ఆలయంలోనూ శనివారం కూడా విశేషపూజల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

టెన్నిస్ విజేతలకు బహుమతుల ప్రదానం



40ఏళ్ళు పైబడిన విభాగం విజేతలకు బహుమతుల ప్రదానం

చింతామణి, మార్చి 9: పట్టణంలోని గోపసంద్రలోని నమనశ్రీ ఎంటర్‌ప్రైజెస్‌కు చెందిన నమ్మ అఖాడ ఆధ్వర్యంలో టెన్నిస్ క్రీడా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. 40ఏళ్లలోపు, పైబడి కేటగిరీలలో రెండు రోజుల పాటు పోటీలు జరిగాయి. 40ఏళ్ల పైబడిన విభాగంలో చింతామణికి చెందిన అజయ్, శివకుమార్‌లు ప్రథమ బహుమతి రూ.5వేల నగదు బహుమతి, ట్రోఫీని దక్కించుకోగా ద్వితీయ బహుమతి రూ.3వేలను కేజీఎఫ్ మురళీకృష్ణ, మంజీత్, తృతీయ బహుమతి రూ.2వేలను సుబ్రహ్మణి, ప్రశాంత్‌లు పొందారు. 40ఏళ్లలోపు విభాగంలో గెన్నిస్‌టోర్నీలో గౌరిబిదనూరుకు చెందిన జావద్, శశాంక్‌లు ప్రథమ బహుమతి రూ.5వేలు, ట్రోఫీని పొందగా, ద్వితీయ స్థానంలో చిక్కబళ్లాపురకు చెందిన అభిన్, తేజాలు, తృతీయస్థానంలో ముళబాగిలుకు చెందిన హేమంత్, రోహిత్‌లు పొందారు. పోటీలను కోచింగ్ మాస్టర్ శ్రీనివాస్ పర్యవేక్షించారు. నమన్ ఎంటర్‌ప్రైజెస్ సభ్యులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం పథకాలపై జాగృతి



ప్రసంగిస్తున్న సీకల్ రామచంద్రగౌడ

శిడ్లఘట్ట, మార్చి 9: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పథకాల లబ్ధిదారులతో భేటీ కార్యక్రమాన్ని, తాలూకాలోని దిబ్బూరహళ్ళి, ఇతర గ్రామాలలో బీజేపీ ఆధ్వర్యంలో గోడలపై రాసే అభియానను చేపట్టారు. ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో అమలవుతున్న ప్రజాసంక్షేమ పథకాల గురించి శాసనసభ మాజీ అభ్యర్థి సీకల్ రామచంద్రగౌడ వివరించారు. కేంద్రప్రభుత్వం ఆర్థిక, సామాజిక, విద్య, ఆరోగ్య రంగాలలో గణనీయమైన మార్పులు తెచ్చి ప్రజలకు చేరువ చేసిందన్నారు. కాగా కాంగ్రెస్, ఇతర పార్టీలతో కలసి కూటమిగా ఏర్పాటై వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాని మోదీని ఓడించేందుకు ప్రయత్నిస్తోందని అయితే అవి ఫలించవన్నారు. మళ్లీ ప్రధానిగా నరేంద్రమోదీని గెలిపించేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. గోడలపై 'మరోసారి మోదీ' అనే నినాదాన్ని రాశారు. అన్ని గ్రామాలలో స్థానికంగా బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశాలను చురుగ్గా నిర్వహిస్తున్నారు. పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే వాసు కన్నుమూత



మాజీ ఎమ్మెల్యే వాసు (ఫైల్)

బెంగళూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే వాసు (72) శనివారం కన్నుమూశారు. విద్యావేత్తగా మైసూరు మేయర్‌గాను, ఎమ్మెల్యేగాను సేవలందించిన ఆయన మృతి పార్టీకి తీరని నష్టమని కేపీసీసీ అధ్యక్షుడిగా ఉన్న డీసీఎం డీకే శివకుమార్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్యతోపాటు పలువురు ప్రముఖులు వాసు మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయనకు ప్రగాఢ సంతాపం తెలిపారు. వాసు మృతి పట్ల బీజేపీ కూడా దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర ఒక ప్రకటన విడుదల చేశారు. వాసు కుమారుడు కవీశ్‌గౌడ బీజేపీ నేతగా ఉన్నారని గుర్తు చేశారు. వాసు ఆత్మ శాంతించాలంటూ ఆయన ప్రార్థించారు.

బలమందె గ్రామంలో ఉరుసు

బంగారపేట, మార్చి 9: తాలూకాలోని బలమందె గ్రామంలో శెహన్‌షా అస్థాన మసీదు ట్రస్టు ఆధ్వర్యంలో 27వ వార్షిక ఉరుసు శుక్రవారం రాత్రి ఘనంగా జరిగింది. తొలుత గంధాన్ని ఊరేగించారు. దర్గా ఆవరణలో డిల్లీ, కొల్హాపురకు చెందిన బృందాలచే ఖవాలి ఉత్సాహంగా సాగింది. హిందూ ముస్లిం బేధభావం లేకుండా ప్రజలంతా పాల్గొనడం సంతోషకరమైన అంశమని గ్రామ పంచాయతీ అధ్యక్షుడు రామశెట్టి తెలిపారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ, ట్రస్టు అధ్యక్షుడు సయ్యద్ నవాజ్, కార్యదర్శి సయ్యద్ నయాజ్, ఖాదర్, బాషా, గౌస్, యారబ్ తదితరులు పాల్గొన్నారు.

గ్యారెంటీ పథకాల నియోజకవర్గ కమిటీ అధ్యక్షుడిగా వాసుదేవరెడ్డి



వాసుదేవరెడ్డిని అభినందిస్తున్న అనిల్‌రెడ్డి

బొమ్మనహళ్ళి, మార్చి 9: నియోజకవర్గంలోని హెచ్ఎస్ఆర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు టీ వాసుదేవరెడ్డిని రాష్ట్ర ప్రభుత్వ గ్యారెంటీ పథకాల కమిటీకి సంబంధించి నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమించారు. ఇదే సందర్భంగా బీబీఎంపీ సమితి సభ్యుడిగా నియమితులయ్యారు. శనివారం ఆయన మీడియాతో వాసుదేవరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తనపై నమ్మకం ఉంచి తనకు బాధ్యతలు అప్పగించడంపై ముఖ్యమంత్రి, డీసీఎంలకు ధన్యవాదాలు తెలిపారు. త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ఆయనకు బొమ్మనహళ్ళి కాంగ్రెస్ ప్రతినిధి అనిల్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

గంట కారు పార్కింగ్‌కు వెయ్యి రూపాయలు

▸▸ **సోషల్ మీడియాలో నెటిజన్ల ఆగ్రహం**

బెంగళూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా కారు పార్కింగ్ చేస్తే అత్యంత ఎక్కువగా అంటే గంటకు వందరూపాయలు దాకా ఉండవచ్చు. కానీ బెంగళూరులోని యూబీ సిటీ మాల్‌లో కేవలం గంట కారు పార్క్ చేస్తే చాలు ఏకంగా వేయి రూపాయల చెల్లించాల్సి ఉంటుంది. బెంగళూరులోనే కాకుండా దేశంలోనే ఇది అత్యంత ఎక్కువ వసూలు చేసే పార్కింగ్ ఫీజుగా తెలుస్తోంది. నగరంలోని కస్తూర్బా రోడ్డుకు అనుబంధంగా ఉండే యూబీ సిటీ మాల్ అత్యంత విలాసవంతమైనదిగా పేరుంది. దశాబ్దాల కాలంగా మాల్ ఇదే తరహాలోనే ఆదరణ కలిగి ఉంది. ఒకప్పటి లిక్కర్ కింగ్‌గా రాణించిన విజయ్‌మాల్యా నిర్మించిన అత్యంత విలాసవంతమైన షాపింగ్ మాల్. ఇక్కడ షాపింగ్‌తో పాటు రెస్టారెంట్‌లతో పాటు అత్యంత సుందరంగా నిర్మించారు. 14వ అంతస్తులో స్కైబార్ కూడా ప్రత్యేకం. ఇక్కడికి వచ్చేవారిలో ఎక్కువమంది శ్రీమంతులే ఉంటారు. పలు కంపెనీలు ఇక్కడ కొనసాగుతున్నాయి. ఇక్కడ కారు పార్కింగ్ చేస్తే గంటకు ఏకంగా వెయ్యి రూపాయలు ఫీజు చెల్లించాల్సి ఉందనే విషయం వారం రోజులుగా వైరల్ అవుతుండగా నెటిజన్‌లు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

టీడీపీ, బీజేపీ, జనసేన పొత్తు చారిత్రాత్మకం



బీజేపీ నేత గంగవరపు సుబ్బారావు

బెంగళూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు దుష్టపాలన నుంచి త్వరలోనే విముక్తి లభించబోతోందని బెంగళూరులో స్థిరపడిన ఉదయగిరి బీజేపీ నేత గంగవరపు సుబ్బారావు పేర్కొన్నారు. ఢిల్లీలో శనివారం తెలుగుదేశం, జనసేన బీజేపీల మధ్య కుదిరిన పొత్తును చారిత్రాత్మకమైనదిగా అభివర్ణించారు. దేశ అభివృద్ధి కోసం ప్రధాని నరేంద్రమోదీ, హోం మంత్రి అమిత్‌షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా ఎంతగానో చొరవ తీసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న అరాచకాలకు అడ్డుకట్ట వేసి ఏపీ ప్రజల ఉజ్వల భవిష్యత్తుకు ఈ పొత్తు దోహదపడ్డం ఖాయమన్నారు. ఈ మేరకు బెంగళూరులో శనివారం టీడీపీ నేతలు కూనల వెంకటేశ్వరరావు, గోళ్ళ కిరణ్ కుమార్‌తో కలసి మీడియా సమావేశం నిర్వహించారు. పొత్తు అనంతరం ఆంధ్రప్రదేశ్‌లోనూ, కర్ణాటకలోనూ కార్యకర్తలు సంబరాలు చేసుకుంటున్నారన్నారు.

ఏపీ విభజన హామీలపై రాజకీయ పార్టీలు డిక్లరేషన్ విడుదల చేయాలి

బెంగళూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలో ఇచ్చిన హామీల అమలుపై శాసనసభ ఎన్నికలకు ముందే అన్ని రాజకీయ పార్టీలు తమ విధానాలను స్పష్టం చేయాలని డిక్లరేషన్ రూపంలో ప్రకటించాలని కర్ణాటక తెలుగు ప్రజా సమితి విజ్ఞప్తి చేసింది. సమితి అధ్యక్షుడు డా.బొందు రామస్వామి నగరంలో శనివారం మీడియాతో మాట్లాడుతూ విభజన హామీల అమలు కోసం తెలుగు ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ విభజన జరిగి సంవత్సరాలు గడుస్తున్నా ఇంతవరకు రాజధాని లేక ప్రపంచవ్యాప్తంగా ఉన్న 18 కోట్ల మంది తెలుగు ప్రజలు తీవ్ర ఆవేదన చెందుతున్నారన్నారు. విభజన హామీలను అమలు చేస్తామని కాంగ్రెస్ ప్రకటించిందని ఈ విషయంలో బీజేపీ, జనసేన, తెలుగుదేశం పార్టీల స్పందన కూడా చాలా ముఖ్యమని ఆయన అభిప్రాయపడ్డారు. విభజన హామీలపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఈ రాజకీయ పార్టీలు తమ ఎన్నికల ప్రణాళికల్లో ప్రధానంగా ప్రకటించాలని డా.బొందు డిమాండ్ చేశారు. విభజన హామీలు అమలయ్యేలా ప్రజలు తమ ఓటు ఆయుధాన్ని చాలా ఆలోచించి విని యోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కాగా సమాజసేవకు తనను తాను అర్పించుకున్న ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ఛైర్మన్ డా.సుధామూర్తిని రాజ్యసభకు నామినేట్ చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజు మహిళలకు ఇచ్చిన గొప్ప కానుక అని అభివర్ణించారు.

ది గుడ్‌లూమ్ కలెక్టివ్‌కు శ్రీకారం



జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో ప్రముఖులు

బెంగళూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): భారతీయ చేనేత రంగంలో ఖ్యాతి గడించిన గోకూప్ సంస్థ టాటా ట్రస్టు అనుబంధంగా ఉన్న అంతకరణ్ సహకారంతో నగరంలోని రైన్‌ట్రీ ప్రాంగణంలో ది గుడ్ లూమ్ కలెక్టివ్ ప్రదర్శనకు శ్రీకారం చుట్టింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం నాడు లాంఛనంగా ప్రారంభమైన ఈ ప్రదర్శన మార్చి 10 వరకు కొనసాగనుంది. ఈ మేరకు నిర్వాహకులు నగరంలో శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 7 వరకు ప్రదర్శన ఉంటుందని ఇందులో అతివలు అమితంగా ఇష్టపడే వస్త్రశ్రేణితో పాటు పలు అపురూపమైన ఆభరణాల కలెక్షన్, హస్తకళాఖండాలు ఉన్నాయని ప్రకటనలో తెలిపారు. ఒడిశ్శా, ఆంధ్ర ప్రదేశ్, మధ్యప్రదేశ్, గుజరాత్, అస్సోమ్ నాగాలాండ్ తదితర రాష్ట్రాలలో ఖ్యాతి గడించిన వస్త్రశ్రేణి ఈ ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణ కానుందన్నారు.

భక్తిశ్రద్ధలతో విద్యాగణపతి ప్రతిష్ఠాపన



కార్యక్రమంలో పాల్గొన్న స్వామిజీ తదితరులు

బెంగళూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు పీణ్యా రెండోస్టేజ్‌లోని ఆంధ్రహళ్ళి మెయిన్‌రోడ్డులోగల అనుపమ కళాశాల ఆవరణలో విద్యాగణపతి ప్రతిష్ఠాపన, గోపుర కుంభాభిషేకం భక్తిశ్రద్ధలతో జరిగాయి. శృంగేరి మహా సంస్థానానికి చెందిన శివగంగ శాఖ మఠాధిపతి పురుషోత్తమ మహాస్వామి సమక్షంలో ధార్మిక విధి విధానాలు నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులకు అక్షింతలు అందచేశారు. సంస్థ ఛైర్మన్ ఎస్ఎల్ కృష్ణమూర్తి, ప్రిన్సిపాల్ డీకే వెంకటేశ్, ప్రధానోపాధ్యాయిని విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి భూమిపూజ

మహదేవపుర, మార్చి 9: నియోజకవర్గంలోని హూడి, గరుడాచార్‌పాళ్య, దొడ్డ కన్నల్లి వార్డులలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నూతన భవన నిర్మాణాలకు ఎమ్మెల్యే మంజుళా అరవింద లింబావళి భూమిపూజ చేశారు. ప్రత్యేక గ్రాంటు కింద ఒక్కో కేంద్రానికి రూ.80లక్షలు చొప్పున మూడు కేంద్రాలకు రూ.2.40 కోట్లతో నిర్మించనున్నారు. ఆరోగ్యానికి సంబంధించి మెరుగైన సౌలభ్యాలు కల్పించనున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గ గ్రామీణ బీజేపీ అధ్యక్షుడు నటరాజ్, హోబళి అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, ప్రముఖులు అనంతరామయ్య, హూడి పిళ్ళప్ప, అభిషేక్, పవన్‌శెట్టి, శక్తికేంద్రం అధ్యక్షుడు శ్రీనివాస్, వెంకటేశ్‌రెడ్డి, బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జరగనహళ్లిలో మహిళా దినోత్సవం



మహిళలకు సన్మానం

బొమ్మనహళ్ళి, మార్చి 9: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జగరనహళ్ళిలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఉమేశ్ గౌడ నేతృత్వంలో శనివారం ప్రత్యేక కార్య క్రమం నిర్వహించారు. తొలుత పౌరకార్మికులను సత్కరించారు. ఇదే సందర్భంగా వివిధ రంగాల సాధకులను సత్కరించి చీరలను పంపిణీ చేశారు. ప్రతి సంవత్సరం ఆడపడుచులకు తనవంతుగా పసుపుకుంకుమ ఇస్తున్న ట్టు తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని అర్థవంతంగా ఆచరించడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ నాయకులు సుగుణమ్మ, అంజలి మేరి, ముంతాజ్ తదితరులు, స్థానిక కాంగ్రెస్ కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.